క్లుప్తంగా

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న అండెం యాదగిరి, పద్మ దంపతులు

మద్దిరాల: మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో నిర్వహించనున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనకు గ్రామానికి చెందిన అండెం యాదగిరి, పద్మ దంపతులు ఆదివారం రూ.51,116 విరాళాన్ని ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముక్కాల అవిలమల్లు, మద్దెల భిక్షపతి, వల్లపు నర్సయ్య, పులుగుజ్జ మహేందర్, మద్దెల మధు తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న జానకమ్మరాధాకృష్ణ

పెన్‌పహాడ్: మండల కేంద్రంలోని సీతారాంపురం కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి ఎంపీటీసీ ఊరుకొండ జానకమ్మరాధాకృష్ణ రూ.20,116లు విరాళాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గుమ్మిరెడ్డి భిక్షంరెడ్డి, బంటు రాములు, చామకూరి మల్లయ్య, రహిమాన్, బంటు నాగయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



లోయపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏపీఎం మల్లేష్

అర్వపల్లి: మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సెర్ప్ ఏపీఎం వలిశెట్టి మల్లేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి 17శాతం లోపు తేమ ఉండేలా తేవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భద్రమ్మ, సంఘబంధం అధ్యక్షురాలు చేడె సరస్వతి, వీఏవీ సరోజ, ఆల్దాసు లింగయ్య, మంచాల వెంకన్న, వీరాచారి, పగడాల వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రు, సతీష్‌రెడ్డి, మహేష్, రైతులు పాల్గొన్నారు.

సూర్యానాయక్‌తండాలో పశువైద్య శిబిరం



పశువులకు టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి: మండల పరిధిలోని సూర్యానాయక్ తండా గ్రామపంచాయతీ ఆవాసం గన్నెనాయక్‌తండాలో ఆదివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ అర్జున్, గోపాలమిత్రలు ఆల్దాస్ లింగయ్య, కుంభం సురేందర్, సూరారపు అర్జున్, రైతులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాగారం: మండలంలోని ఈటూరు గ్రామ సమీపంలో ఉన్న బిక్కేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి ఆదివారం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్టీసీ బస్సు సేవలు పునరుద్ధరించాలి

మఠంపల్లి : రఘునాథపాలెంకు కోదాడ ఆర్టీసీ అధికారులు బస్సు సేవలను పునరుద్ధరించాలని పీఏసీఎస్ మండల చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఎండీ.అక్బర్‌లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. కోదాడ డిపోకు చెందిన బస్సు గతంలో హుజూర్‌నగర్, మఠంపల్లిల మీదుగా రఘునాథపాలెం నుంచి గుండ్లపల్లి వరకు నడిచేదన్నారు. గత మూడు నెలలుగా ఆర్టీసీ అధికారులు బస్సు సేవలు నిలిపివేయడంతో మండల కేంద్రానికి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నామని, కావున వెంటనే బస్సును పునరుద్ధరించాలని కోరారు. వారి వెంట సయ్యద్‌నిజామ్, మాజీ ఎంపీటీసీ మేడి సామేలు, నాగుల్‌మీరా, పసుపులేటి జానయ్య, నరసింహారావు తదితరులు ఉన్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు



అనాజిపురంలో మురుగు కాల్వలో పేరుకుపోయిన చెదారం



అన్నారంలో రోడ్లపై పారుతున్న మురుగు నీరు

- రోడ్లపైనే పారుతున్న మురుగు నీరు
- విజృంభిస్తున్న దోమలు, ఈగలు
- పట్టించుకోని అధికారులు

పెన్‌పహాడ్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారాయి. సిబ్బంది మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అనాజిపురం, ధర్మాపురం, లింగాల, దూపహాడ్ గ్రామాలతో పాటు కాలనీల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదు. దీనికితోడు కొన్ని గ్రామాల్లో గతంలో నిర్మించిన మురుగు కాల్వలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో నీరు ఒకే చోట నిల్వ ఉంటోంది. ఫలితంగా మురుగు రోడ్లపై పారుతోంది. దోమలు, ఈగలు వ్యాప్తి చెందడంతో పాటు దుర్వాసన వస్తోంది.

మురుగు కాలువలు లేక...

నాగులపాటి అన్నారం, నాగులపహాడ్, మహ్మదాపురం, సింగారెడ్డిపాలెం గ్రామాల్లో కొన్ని చోట్ల మురుగు కాల్వల నిర్మాణం చేపట్టలేదు. దీంతో రోడ్లపైనే మురుగు నీరు పారుతోంది. దుర్వాసన వస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. మురుగు కాల్వలు నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

పూడిక తీయించాలి

“ మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. నీరు నిల్వ ఉంటుంది. అధికారులు స్పందించి డ్రెయినేజీల్లో పూడిక తీయించాలి.

– సతీష్, అనాజిపురం

డ్రెయినేజీ నిర్మించాలి

“ డ్రెయినేజీ లేక రోడ్లపైనే మురుగు నీరు పారుతోంది. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. మా ప్రాంతంలో మురుగు కాలువలు నిర్మించాలి.

– వెంకన్న, అన్నారం

చర్యలు చేపడతాం



“ గ్రామాల్లో మురుగు కాల్వల్లో పేరుకుపోయిన మురుగు తొలగించేలా చర్యలు చేపడతాం. గ్రామాల ప్రత్యేక అధికారులకు తెలియజేసి మురుగు కాల్వలు శుభ్రం చేయించడంతో పాటు మురుగు నీరు రోడ్లపై పారకుండా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

పశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నాగారం: వేసవిలో పశువుల సంరక్షణకు పాడి రైతులు, గొర్రెల, మేకల పెంపకందారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బత్తుల రవి అన్నారు. ఆదివారం నాగారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. వేసవిలో తీవ్రమైన ఎండలు, వడగాలులతో పశువులు వడదెబ్బకు గురై ఉత్పాదక శక్తి తగ్గి మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. పశువులు, గొర్రెలు, మేకలను వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు తోలుకెళ్లాలని సూచించారు. వేసవిలో పశువులకు పచ్చిగడ్డి, దాణాతో పాటు, మంచినీరు ఎక్కువగా అందించాలన్నారు. సమావేశంలో జేవీఓ నాగరాజు, ఎల్‌ఎస్‌ఏ మురళి, మధుసూదన్ తదితరులున్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

నూతనకల్: ఉపాధి హామీ కూలీలకు వేసవి దృష్ట్యా అన్ని రకాల వసతులు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ అధికారులను కోరారు. ఆదివారం నూతనకల్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కూలీలు పనిచేసే ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం టెంట్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు రవి, వెంకట్‌రెడ్డి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

చామల గెలుపునకు కృషి చేయాలి

నూతనకల్: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం నూతనకల్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డుపల్లి అంజయ్య, దరిపెల్లి వీరన్న, అశోక్, బంటు బద్రి తదితరులు పాల్గొన్నారు.

నామవరంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న విద్యుత్ డీఈ

మోతె : మండల పరిధిలోని నామవరం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా అవేంజర్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదివారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను విద్యుత్ డీఈ నిమ్మ వెంకటకృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో యువకులు క్రీడా రంగంలో ముందుండాలన్నారు. భారతదేశ భవిషత్ క్రీడాకారుల చేతుల్లో ఉందన్నారు. క్రీడలపై యువకులు శ్రద్ధ పెంచుకోవాలన్నారు.

చలివేంద్రం సద్వినియోగం చేసుకోవాలి



అడివెంల క్రాస్‌రోడ్డులో చలివేంద్రం ప్రారంభిస్తున్న రేఖ

అర్వపల్లి: వేసవిలో దాహార్తి తీర్చడానికి రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డి కోరారు. ఆదివారం అడివెంల క్రాస్‌రోడ్డులో రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖతో కలిసి చలివేంద్రం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, బోయపల్లి రవి, నిమ్మనగోటి మల్సూర్, జక్కి జనార్దన్, హర్షవర్ధన్, శ్రీను, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



అనంతారం మోడల్ స్కూల్‌లో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ వేముల బాలరాజు మాట్లాడుతూ పరీక్షలకు 133 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 113 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ అధికారులు అశోక్‌రెడ్డి, సోమసుందర్ పాల్గొన్నారు.

నాగారం: మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ కుంట రమేష్ మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి 100 సీట్లకు, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. 6వ తరగతిలో 105 మందికి 85 మంది, ఇతర తరగతులకు 34 మందికి 29 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఓ ఆర్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటితో చెరువులు నింపాలి



కొత్తగూడెం మేజర్ కాల్వ తూము వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నడిగూడెం : నాగార్జునసాగర్ నీటితో మండలంలోని చెరువులను నింపాలని బీజేపీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆదివారం నడిగూడెం మండలంలోని చాకిరాల వద్ద గల కొత్తగూడెం మేజర్ కాలువ తూము వద్ద బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో చెరువులు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. దీంతో ప్రజలతో పాటు మూగజీవాలకు కూడా తాగు నీరు దొరక్క అల్లాడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లతీఫ్, శోభారాణి, వీరబాబు, వీరన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి పరామర్శ

అర్వపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రింగు బాలయ్యను ఎమ్మెల్యే మందుల సామేలు ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, దాసరి సోమయ్య, గుడిపల్లి మధుకర్‌రెడ్డి, జె.సోమయ్య, నర్సింగ కృష్ణమూర్తి, గుడిపల్లి సోమిరెడ్డి, మామిడి సత్యనారాయణ, నర్సింగ వెంకటేశ్వర్లు, కుంభం సత్తయ్య, కొప్పుల సత్తిరెడ్డి, కొమిరెల్లి, బొల్లం సైదులు, మాదగాని విక్రమ్, సైదుల కిరణ్, నర్సింగ వెంకటేశ్వర్లు, బాబూరావు తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సామేలు

అర్వపల్లి: మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు బోయపల్లి రవి, నాయకులు జెట్టి జనార్దన్, కోళ్ల శ్రీను, బషీర్, అనపర్తి ప్రశాంత్‌తో పాటు మరికొంతమంది నాయకులు ఆదివారం తిరుమలగిరిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మందుల సామేలు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఆయన కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాగారంలో..

నాగారం: మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా చిప్పపల్లి సుమన్, చిప్పపల్లి అంజిలకు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మంగదుడ్ల దశరథ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, జాజుల వీరయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ దేవాలయంలో మంత్రి పూజలు



ముత్యాలమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు

అర్వపల్లి: మండల పరిధిలోని అడివెంల గ్రామ ఎస్సీ కాలనీలో ముత్యాలమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు, భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, డీసీసీబీ మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డి హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో రేఖ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ బోయపల్లి రేఖ, ముదిరెడ్డి వెంకట్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పద్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వెలుగుపల్లిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తుంగతుర్తి: మండల పరిధిలోని వెలుగుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 1986–87 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సర్గం మల్లయ్య, గుడిపాటి నర్సయ్య, బ్రహ్మాచారి, పాటిరాం నర్సింహారెడ్డి, నిమ్మల సోమలింగం, పందిరి మల్లయ్య, శ్రీధర్‌రావు, కీర్తి సత్యనారాయణ, యాదగిరి, ఆకుల సోమనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

తిరుమలగిరి: తిరుమలగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మండడి పద్మారెడ్డి, కృష్ణమూర్తి, రహిమాన్ అలీ, కృష్ణమాచారి, అంజయ్య, కొండల్‌రెడ్డి, దేవదాసు, విద్యార్థులు సోమనర్సయ్య, వీరప్రసాద్, రమేష్, కొమిరెల్లి, మల్లయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముస్లింలకు పవిత్ర పండుగ రంజాన్

చివ్వెంల(సూర్యాపేట): ముస్లింలకు రంజాన్ పవిత్రమైన పండుగ అని మత గురువు అత్తర్ మౌలానా అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన వార్డు కౌన్సిలర్ షేక్ భాషా తనయుడు ఆసిఫ్ తన సొంత నిధులు రూ.3లక్షల వ్యయంతో స్థానిక మసీద్‌లో చేపట్టిన వజూ ఖానాను ప్రారంభించారు. కార్యక్రమంలో ఖలీల్ సాహెబ్, గయాజ్ సాబ్, భాషా, సైదా, నాగులు, పఠాన్, అజ్గర్, సైది, యూసుఫ్, మహిమూద్, షరీఫ్, ఇమాం సాబ్, ఖమర్ పాష, మజీద్ తదితరులు పాల్గొన్నారు.



వజూ ఖానా ప్రారంభిస్తున్న మౌలానా

అక్రమంగా మట్టి తరలింపు

- చెరువుల్లోని నల్లరేగడి మట్టిని తరలిస్తున్న ఇటుక బట్టీల నిర్వాహకులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



ముక్కుడుదేవులపల్లిలో మట్టి తవ్వుతున్న జేసీబీ



ఇటుక బట్టీల వద్ద డంప్ చేసిన రేగడి మట్టి

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : మండలంలో ఇటుక బట్టీల కోసం చెరువుల్లోని నల్లరేగడి మట్టిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ప్రధానంగా ఆత్మకూరు మండలంలోని నెమ్మికల్లు, ఏపూరు, దాచారం, ముక్కుడుదేవులపల్లి, కోటపహాడ్ గ్రామాల్లో ఇటుకబట్టీ నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండా చెరువుల్లోని నల్లరేగడి మట్టిని తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతో పాటు చెరువుల్లో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టడంతో పలువురు ప్రమాదాల బారిన పడే అవకాశముంది.

రాత్రికి రాత్రే తరలింపు..

చెరువుల్లో నల్లరేగడి తరలింపునకు వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. రాత్రికి రాత్రే పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, జేసీబీల సాయంతో చెరువుల్లో తవ్వకాలు చేపడుతున్నారు. రాత్రంతా చెరువుల నుంచి మట్టిని తరలించి తమకు అనుకూలంగా ఉన్న చోట డంప్ చేస్తున్నారు. ఒక్కో వ్యాపారి వందలాది ట్రిప్పుల రేగడి మట్టిని తరలిస్తున్నారు. ఈ తంతు స్థానికంగా ఉన్న కొందరు ప్రజాప్రతినిధులకు తెలిసినా... అధికారుల కళ్లు గప్పి అండగా ఉంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

అనుమతులు లేకుండానే..

సారవంతమైన నల్లరేగడి మట్టిని రైతులు తమ వ్యవసాయ పొలాల్లో పోసుకుంటే ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. అయితే రైతులు తోలుకోవడానికి వీలు లేకుండా సారవంతమైన మట్టిని ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు. ఈ మట్టి తోలకానికి ప్రభుత్వ అనుమతితోపాటు గ్రామపంచాయతీ అనుమతి తీసుకోవాల్సి ఉండగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

గుంతలతో ప్రమాదాలు

రేగడిమట్టి తరలింపు పేరుతో చెరువుల్లో ఇష్టానుసారంగా గుంతలు పెడుతున్నారు. ఈ క్రమంలో చెరువుల్లో నీరు చేరినప్పుడు నీళ్లు తాగడానికి వెళ్లిన పశువులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి.

కేటీఆర్.. భాష మార్చుకోవాలి

నేరేడుచర్ల : మాజీ మంత్రి కేటీఆర్ తన భాషను మార్చుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం నేరేడుచర్లలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేటీఆర్ అధికారం కోల్పోయిన బాధలో రాష్ట్ర ముఖ్యమంత్రిని గుంపు మేస్త్రి అని, ప్రధాన మంత్రిని తాపీ మేస్త్రి అని సంబోధించడం ఆయన అవివేకమన్నారు. ఒక్కసారి ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన నోరు అదుపులో లేకుండా మాట్లాడటం తగదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, మండల, పట్టణ పార్టీ కార్యదర్శులు సింహాద్రి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, వెంకట్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

అధ్వానంగా రహదారులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి, నూతనకల్ మండలాల ప్రజలు రాకపోకలు సాగించే అర్వపల్లి–కొమ్మాల రహదారి అధ్వానంగా మారింది. బీటీ లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. మొత్తం 9కిలోమీటర్ల రోడ్డు అంతా దెబ్బతిన్నది. కొన్నేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో గుంతలు ఏర్పడి రాకపోకలకు ప్రజలు ఇబ్బందిగా మారింది. నిధులు మంజూరు చేసి బీటీ రెన్యూవల్ చేపట్టాలని కోరుతున్నారు.



అర్వపల్లి శివారులో బీటీ లేచిపోయి తేలిన గుంతలు



కాసర్లపహాడ్ సమీపంలో దెబ్బతిన్న బీటీ



కొమ్మాల సమీపంలో రోడ్డు దుస్థితి..